



చేపల వేట కోసం సంద్రంలోకి వెళ్తున్న మత్స్యకారుల్లో చాలామంది మృత్యువాత పడుతున్నారు. రాకాసి అలలు వారిని మింగేస్తున్నాయి. సంప్రదాయ పద్ధతుల్లో వేట సాగిస్తుండడంతో అలల ధాటికి పడవలు బోల్తాపడుతున్నాయి. ఫలితంగా కొందరు సంద్రంలో గల్లంతై మృతి చెందు తుండగా, మరికొందరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుంటున్నారు. జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి. దీంతో చేపల వేట ప్రమాదకరంగా మారింది. వేటకు వెళ్లి తిరిగి తీరానికి చేరే వరకూ బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏటా పదుల సంఖ్యలో గంగపుత్రులు మృతి చెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది.



ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం తీరంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు

మృత్యు వేట

- ప్రమాదాల బారిన మత్స్యకారులు
- ఏటా పదుల సంఖ్యలో మృతి
- మారని గంగపుత్రుల బతుకులు
- మూలపేట హార్బర్ నిర్మాణంపై గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ప్రస్తుత ప్రభుత్వంపైనే ఆశలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడడం పరిపాటిగా మారింది. తుపాన్లు, భారీ వర్షాలు సంభవించినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడో ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు మత్స్యకారులు గుర్తుకొస్తారు. తరువాత మరిచిపోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా, వారి కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నామని ప్రకటిస్తున్నా మత్స్యకారుల తలరాతలు మారడం లేదు. వారికి స్వాంతన కలిగే శాశ్వత ప్రాజెక్టులేవీ జిల్లాలో నిర్మాణం కావడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదు. కనీసం అడుగులు పడలేదు. ఎన్నికలకు ముందు మూలపేట హార్బర్ అంటూ హడావుడి చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జిల్లాలో తీర ప్రాంత ప్రాజెక్టులపై దృష్టిపెట్టడం మత్స్యకారులకు కాస్త ఉపశమనం కలిగించే విషయం.

సుదీర్ఘ తీరం..

రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం జిల్లా సొంతం. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. లక్షకుపైగా జనాభా ఉన్నారు. మొత్తం 6,211 మంది మత్స్యకారులు వేటకు వెళ్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే జిల్లాలో ఫిషింగ్ హార్బర్లు కానీ, జెట్టీలు కానీ అందుబాటులో లేకపోవడంతో మత్స్యకారులు సంప్రదాయ రీతిలో వేటకే పరిమితమయ్యారు. ఇప్పటికీ నాటు పడవలపై ప్రమాదకరస్థితిలో వేట సాగిస్తున్నారు. స్థానికంగా వేట గిట్టుబాటు గాక జిల్లా నుంచి వేలాది మంది మత్స్యకారులు చెన్నై, గుజరాత్, ముంబాయి, కోల్‌కతా, పారాదీప్ వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కాంట్రాక్టర్ల వద్ద పనికి కుదురు తున్నారు. వేటలో భాగంగా విదేశీ జలాల్లోకి ప్రవేశించి అక్కడి కోస్టుగార్డులకు చిక్కి ఖైదీలుగా మారుతున్నారు. ఇటువంటి (మిగతా 6వ పేజీలో..)

- ఈనెల 1న వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన నలుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతయ్యారు. మర బోటుపై వేట చేస్తుండగా రాకాసి అలకు బోటు బోల్తా పడింది. అందులో ఒకరు ఈదుకుంటూ తీరానికి చేరారు. మరొకర్ని తోటి మత్స్యకారులు కాపాడారు. మరో ఇద్దరు మత్స్యకారులు వంక కృష్ణ, బుంగ ధనరాజు మృతి చెందారు.



ధనరాజు (ఫైల్)



కృష్ణ (ఫైల్)

- గత ఏడాది జూలై 8న సోంపేట మండలం వాడపాలెనికి చెందిన పలిశెట్టి జోగారావు అనే మత్స్యకారుడు వేట కోసం మరో నలుగురితో కలిసి పడవపై సముద్రంలోకి వెళ్లాడు. అలల ఉధృతికి పడవ బోల్తా పడింది. జోగారావు గల్లంతయ్యాడు. మిగతా నలుగురు క్షేమంగా తీరానికి చేరారు. ఆ మరుసటి రోజు జోగారావు మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది.



జోగారావు(ఫైల్)

- గత ఏడాది నవంబరు 18న రణస్థలం మండలం అల్లివలస గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ అనే మత్స్యకారుడు మరో ఇద్దరితో కలిసి తెప్పపై వేటకు వెళ్లాడు. ఆ సమయంలో తెప్ప బోల్తా పడడంతో అనిల్ గల్లంతయ్యాడు. మిగతా ఇద్దర్ని తోటి మత్స్యకారులు కాపాడారు. అనిల్ మృతదేహం ఆ తరువాత రోజు తీరానికి కొట్టుకు వచ్చింది.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ రంగాన్ని జిల్లాలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్కలిలో పట్టు మహాదేవ్ కోనేరు, భావనపాడు బీచ్, కొత్తపేట కొండతో పాటు టెక్కలిలో దివంగనేత కింజరాపు ఎర్రన్నాయుడు పార్కు అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక లు రూపొందించాలని ఆదేశించారు. నక్షత్ర హోటళ్లు ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఆహ్లాదకర వాతావరణం, గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు పార్కు వంటివి ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ రమణ, జేఈ మన్మథరావు, జిల్లా పర్యాటకు అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

అలల తాకిడికి కొట్టుకుపోయిన బోటు

- రూ.15లక్షల ఆస్తి నష్టం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కివలస పంచాయతీ గెద్దలపాడు సముద్ర తీరంలో బుధవారం బోటు కొట్టుకుపోయింది. దీంతో రూ.15లక్షల ఆస్తినష్టం సంభవించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో అలలు తాకిడి ఎక్కువగా ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా మంగళవారం ఉదయం తమ బోట్లను తీరంలో లంగరు వేశారు. బుధవారం ఉదయం తమ బోట్లు, వలలు చూసేందుకు వారు తీరానికి వెళ్లగా ఓ బోటు కనిపించలేదు. సముద్రంలోకి కొట్టుకుపోయినట్లు గుర్తించి వెంటనే అప్రమత్తమయ్యారు. తాడుతో బోటును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే బోటు సగం విరిగిపోగా, మోటారు, తదితర సామగ్రి ధ్వంసమయ్యాయి. వలలు కొట్టుకుపోయాయి. సుమారు రూ.15లక్షల వరకు నష్టం వాటిల్లిందని బోటు యజమాని శ్రీరంగం వీరస్వామి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే భావనపాడు మెరైన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బోటు ప్రమాద వివరాలను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు తీసుకువెళ్లారు. వలలు కొట్టుకుపోయాయని, బోటు పాడైందని తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత మత్స్యకారుడు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.



దెబ్బతిన్న బోటు



ఆదిత్యాలయం

కమీషన్ కొట్టు.. బిల్లు పట్టు

- ఆదిత్యాలయంలో ఓ రెగ్యులర్ ఉద్యోగి పనితీరుపై విమర్శలు
- నెలల తరబడి బీరువాల్లో అంటిపెట్టుకున్న బిల్లులు
- ప్రీ ఆడిట్ పేరుతో స్వీపర్ల జీతాలకూ అడ్డంకులు

అరసవల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఓ రెగ్యులర్ ఉద్యోగి అంతాతానై వ్యవహరిస్తున్నాడు. ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాటగా అక్కడ సాగుతోంది. ఉద్యోగులకు జీతాలు, పనులకు బిల్లులు చెల్లించాలంటే ఆయనకు కమీషన్ ఇవ్వాల్సిందే. లేకుంటే రోజుల తరబడి ప్రీ ఆడిట్ అవ్వలేదనే సాకుతో ఆఫీసులోనే దస్త్రాలు ఉండిపోతాయి. ఆలయానికి రూ.కోట్ల ఆదాయం వస్తున్నా స్వీపర్లకు జీతాలు కూడా చెల్లించని పరిస్థితి నెలకొంది. ఆ ఉద్యోగి పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కార్యాలయంలో అన్ని పనులు ఇంచుమించు ఆ ఉద్యోగి చేతుల మీదుగా జరుగుతుండడం, కంప్యూటర్ పరిజ్ఞానం వేరే రెగ్యులర్ ఉద్యోగులకు లేకపోవడంతో ఆయన ఆటలు సాగుతున్నాయి. ప్రసాదాల తయారీ, అన్నదానానికి అవసరమైన కూరగాయలు, ఇతర సరుకుల సరఫరాకు (మిగతా 6వ పేజీలో..)

గంజాయిపై ఉక్కుపాదం

- విశాఖ రేంజ్‌లో రూ.5కోట్ల ఆస్తుల జప్తు
- ప్రతీ జిల్లాలో సైబర్ స్టేషన్.. 5శక్తి బృందాలు
- రాష్ట్రంలో 7శాతం తగ్గిన నేరాలు
- పోక్సో కేసుల్లో నాలుగు నెలల్లోనే శిక్ష ఖరారు
- హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

శ్రీకాకుళంక్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. జిల్లాలో బుధవారం ఆమె పర్యటించారు. అనంతరం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం ఈగల్ టీంలను ఏర్పాటు చేశాం. పాడేరు, మన్యం వంటి చోట గంజాయి సాగును నివారించాం. మాదకద్రవ్యాల కేసుల్లో మూలాలు కనుక్కొని, నేరస్థుల ఆర్థిక స్థితి గతులపై ఆరా తీసి వారి ఆస్తులను జప్తు చేస్తున్నాం. విశాఖ రేంజ్ పరిధిలో మూడు కేసుల్లో రూ.5కోట్ల ఆస్తులు జప్తు చేశాం. గంజాయి సాగు, స్మగ్లింగ్, కొనుగోలు చేసిన వారిపై పీడీ యాక్ట్ పెడుతున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అరికట్టడంలో పట్టు సాధిస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయి. రాష్ట్రంలో నేరాల శాతం 7శాతం తగ్గాయి. పోక్సో కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తున్నాం. విజయనగరం జిల్లాలో 67 పోక్సో కేసులు నమోదు కాగా, 20 కేసుల్లో నిందితులకు నాలుగు నెలల్లోనే శిక్ష పడేలా చర్యలు తీసుకున్నాం. శ్రీకాకుళం జిల్లాలో నేటికి రూ.4కోట్ల మేర ప్రోపర్టీని రికవరీ చేసి నిందితులను అరెస్టు చేశాం. సంకల్పం కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికల భద్రతతో పాటు, గంజాయి నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ జిల్లాలో ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేస్తాం. ఈ బృందాల ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తుల ఫిర్యాదు మేరకు వారి సమస్యలను పరిష్కరిస్తాం. ప్రతీ జిల్లాలో ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి నైపుణ్యం కలిగిన అవుట్ సోర్సింగ్ యువతను నియమించి పెండింగ్‌లో ఉన్న సైబర్ కేసులను పరిష్కరిస్తాం.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయాన్ని హోం మంత్రి అనిత సందర్శించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం ఏఎస్పీ అంకిత సురాన హోం మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మూడు జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. నేరాల గణాంకాలు, రేంజ్ పరిధిలో ఎస్పీలు తీసుకుంటున్న చర్యలపై డీఐజీ గోపినాథ్ జెట్టి హోంమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసుల ప్రతిష్ఠ పెంచేలా ప్రతీ అధికారి, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు దశల వారిగా పోలీసుశాఖకు మౌలిక వసతులు (మిగతా 6వ పేజీలో..)

అకాల వర్షం.. రైతులకు నష్టం

- తడిచిన ధాన్యం రాశులు
- పాక్షికంగా దెబ్బతిన్న నువ్వు, పొద్దుతిరుగుడు



నరసన్నపేట: కంబకాయి జంక్షన్ సర్వీసు రోడ్డుపై తడిచిన ధాన్యం

నరసన్నపేట/జలుమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులకు నష్టం మిగిల్చింది. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎటువంటి మేఘం, ఉరుములు, మెరుపులు లేకుండా ఒక్కసారిగా జోరువాన కురిసింది. దీంతో నరసన్నపేట మండలంలోని కరగాం, కంబకాయి, జమ్ము, నారాయణవలస, జలుమూరు మండలం కోనసింహాద్రిపేట, సైరిగాం తదితర గ్రామాల్లో పొలాలు, కళ్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిచిపోయాయి. ధాన్యం కాపాడుకోవడానికి రాత్రి వేళ రైతులు అష్టకష్టాలు పడ్డారు. ధాన్యంపై పరదాలు కప్పారు. అలాగే పలు గ్రామాల్లో నువ్వు, పొద్దుతిరుగు పంటలు కూడా తడిచిపోవడంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం వాటిని ఆరబెట్టారు. రబీలో ధాన్యం కొనుగోలు చేసే నాథుడు లేక ఈ పరిస్థితి ఏర్పడిందని నరసన్నపేట మండలం భవానీపురానికి చెందిన రైతులు నేతింటి రాజేశ్వరరావు, కర్రెన్న తదితరులు వాపోతున్నారు.



నరసన్నపేట: తడిచిన ధాన్యం చూపుతున్న రైతులు



జలుమూరు: కోనసింహాద్రిపేట వద్ద ధాన్యాన్ని గోనెసంచుల్లో భద్రపరచుకుంటున్న రైతులు

చర్మ వ్యాధులతో జాగ్రత్త

- వేసవిలో ఎక్కువ సోకే ప్రమాదం
- నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులకు దారి
- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- రిమ్స్ ఆసుపత్రిలో ఉచిత చికిత్స



6లో

'జగతిమెట్ట' అక్రమాలపై రెవెన్యూ కొరడా

- తహసీల్దార్, ఇద్దరు వీఆర్వోలు, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ కీలకం
- అధికారుల నిర్ధారణ
- 23 చోట్ల పునాదుల తొలగింపు



6లో

చర్మవ్యాధులతో జాగ్రత్త

- వేసవిలో ఎక్కువ సోకే ప్రమాదం
- నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులకు దారి
- జిల్లాలో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- రిమ్స్ ఆసుపత్రిలో ఉచిత చికిత్స



అరసవల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి ముందుగానే వచ్చేసింది. రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. మండే ఎండల్లో తిరగడం... ఉక్కపోతతో చెమటలు పట్టడం ఈ సీజన్‌లో సర్వసాధారణం. కానీ ఈ కారణాలే చర్మవ్యాధులకు దారి తీస్తాయన్నది గమనార్హం. అప్పటికే చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి ఇది మరింత ఇబ్బందికరం. వాతావరణ మార్పులతో ఏటా ప్రపంచ వ్యాప్తంగా చర్మరోగాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతూ వస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తామర (రింగ్ వార్మ్)

ఇది వేసవిలో చాలా ఎక్కువగా కనిపించే వ్యాధి. కుటుంబంలో ఒకరికి వస్తే అందరికీ సోకుతుంది. చర్మంపై గుండ్రటి మచ్చలు ఏర్పాడతాయి. దురద అధికంగా ఉంటుంది. శరీరంలో ఇది 50శాతం వరకు వ్యాపిస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్తులు, జీన్స్, లెగ్గిన్స్ ధరించే వారిలో ఎక్కువగా ఈ వ్యాధి కనిపిస్తుంది.

చికెన్ పాక్స్

ఇది వేసవిలో పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. ఇది సోకిన వారు బయటకు వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవాలి. నిరభ్యంతరంగా స్నానం చేయవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో దీని తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. తీవ్ర స్థాయిలో వస్తే తప్పనిసరిగా వైద్యుని సంప్రదించాలి.

ఎగ్జిమా (ఎటోపిక్ డెర్మటైటిస్)

చర్మంపై దురదలతో కూడిన నీటి పొక్కులు కనిపిస్తాయి. కాళ్లు, మోచేతులు, మెడ మడతల్లో ఇది వస్తుంది. దీని నివారణకు మాయిశ్చరైజర్స్ వాడాలి. చర్మవ్యాధి నిపుణులను సంప్రదించాలి. ఇది ఒక్కసారి వస్తే ఉబ్బసం తరహాలో తరచుగా వస్తూనే ఉంటుంది. పరిశుభ్రమైన నీటిని తాగడం, చెమట పట్టకుండా చూసుకోవడం, వదులుగా ఉండే దుస్తులు వేసుకోవడం వంటివి చేయాలి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుని సంప్రదిస్తే పూర్తిగా నివారణ య్యే అవకాశం ఉంటుంది.

గజ్జి

చెమట ఎక్కువగా ఉండడం, చర్మానికి అతుక్కునే దుస్తులు వేసుకోవడం.. .అపరిశుభ్రత వల్ల ఈ వ్యాధి వస్తుంది. సాధారణంగా హాస్టళ్లలో చదివే విద్యార్థులలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఇది స్ట్రెప్టోకోకల్ ఇన్‌ఫెక్షన్. నిర్లక్ష్యం చేస్తే రెండో దశకు చేరుకుని కిడ్నీ సమస్యలకు దారి తీస్తుంది. వైద్యులను సంప్రదించి, సరైన మందులను వాడుకోవాలి.

సొరియాసిస్

ఇది దీర్ఘకాలిక వ్యాధి. మోచేతులు, మోకాళ్లు, తలపైన పొలుసుల మాదిరిగా వస్తుంది. ఇది వంశపారంపర్యంగా వస్తుంది. ఇది ఎక్కువ కాలం కొనసాగితే కీళ్ల నొప్పులు, గుండెకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మందులతో పాటు ఫొటోథెరపీ ద్వారా దీనిని నయం చేయవచ్చు. బయోలాజికల్ ఇంజక్షన్లు ఇవ్వడం ద్వారా చక్కని ప్రయోజనం చేకూరుతుంది.



వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రోజుకు కనీసం 3 - 4 లీటర్ల నీరు తాగాలి. సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరిగా వాడాలి. స్వచ్ఛమైన, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. చెమట ఎక్కువ ఉండే శరీర భాగాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసు కోవాలి. తాజా పండ్లు, కూరగాయలు, పండ్ల రసాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. వీలైనంత వరకు ఎండ నుంచి రక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలి.

చికిత్స అందిస్తాం



చర్మ వ్యాధులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నాం. బొల్లిమచ్చలు, సోరియాసిస్ వంటి వ్యాధుల పూర్తి నివారణకు ఫోటోథెరపీ అవసరం. నల్లమచ్చలు, పులిపిర్లు తొలగించడానికి లేజర్లు అవసరం. వీటి ఖరీదు రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఎవరైనా దాతలు ముందుకు వస్తే రిమ్స్ ఆసుపత్రిలో అన్ని రకాల చర్మవ్యాధులకు పూర్తిస్థాయి చికిత్సలు అందించగలం.

- డాక్టర్ కె.వెంకటాచలం, చర్మవ్యాధి నిపుణులు, రిమ్స్ ఆసుపత్రి

సన్‌బర్న్స్

ఎండలో ఎక్కువగా సంచరించే వారికి ఇవి సోకుతాయి. సూర్యుని నుంచి వచ్చే అల్ట్రా వయొలెట్ కిరణాల వల్ల ఈ ఇబ్బంది తలెత్తుతుంది.

లక్షణాలు

- చర్మం ఎర్రబడడం
- మంట
- కాలిన భావన
- ఫొటో సెన్సిటివిటీ

నివారణ ఇలా..

సన్‌స్క్రీన్ లోషన్ వాడాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. నేరుగా ఎండలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వైద్యుల సూచనతోనే..

ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే సాధారణంగా రోగులు మందుల షాపులో ఆయింట్‌మెంట్ కొనుగోలు చేస్తారు. కానీ స్టెరాయిడ్ కలిగిన ఆయింట్‌మెంట్‌ల వల్ల ఇది మొండి తామరగా మారి మరింత ఇబ్బంది పెడుతుంది. వైద్యులను సంప్రదించి మందులు వాడాలి. వదులుగా ఉండే దుస్తులు వేసుకోవాలి. కుటుంబంలో ఒకరికి వస్తే వారి దుస్తులు ఇతరులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

'వంశధార' కాలువకు రూ.1600 కోట్లు అవసరం

- ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ రాంగోపాల్

హిరమండలం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'వంశధార ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ ద్వారా గత 50 ఏళ్లుగా దాదాపు 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం కాలువ దీనస్థితిలో ఉంది. 2,400 క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉండగా.. 1800 క్యూసెక్కులు కూడా వెళ్లడం లేదు. కచ్చితంగా ఆధునికీకరించాల్సి ఉంది. దీనికోసం రూ.1600 కోట్లు అవసరం. అంచనాలు తయారు చేశాం. ప్రభుత్వానికి అందజేసే ముందు క్షేత్ర స్థాయిలో కాలువ స్థితిగతులు పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామ'ని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ డి.రాంగోపాల్ చెప్పారు. బుధవా రం హిరమండలం వద్ద వంశధార రిజర్వా యర్ పనులు, లిఫ్ట్ ఇరిగేషన్, మరమ్మ తులకు గురైన గొట్టాబ్యారేజీ దిగువ ప్రాం తాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల తో మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం రాతికట్టుతో నిర్మించిన గొట్టాబ్యారేజి ఎడమ కాలు వకు కాంక్రీ ట్‌తో మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. 14ఏళ్ల క్రితం షట్టర్ల కుంభ కోణం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. నాలుగైదు రోజుల్లో అప్పటి అధికారులను పిలిపించి... సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అచ్చెన్న హామీ ఇచ్చారని చెప్పారు. గొట్టాబ్యారేజి దిగువ భాగంలో రక్షణ గోడలు బాగా దెబ్బతిన్నాయన్నారు. దీని కోసం రూ.12.50 కోట్లు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. వంశధార రిజర్వాయర్ 87, 88 ప్యాకేజి పనులు 90 శాతం పూర్తయ్యాయని సీఈ రాంగోపాల్ చెప్పారు. ఆయనతోపాటు ఎస్ఈ పీవీ తిరుపతి రావు, డీసీఈ బి.శ్రీహరి, డీఈఈలు ఎంవీ సురేష్, ఆర్.రామకృష్ణ ఉన్నారు.



రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న సీఈ రాంగోపాల్

కమీషన్ కొట్టు.. బిల్లు పట్టు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి గత ఏడాది జరిగిన వేలంలో కొందరు కాంట్రాక్టు దక్కించుకున్నారు. అయితే, ఈ సరుకులు సరఫరా చేసిన వారిలో కొందరికి ఇంకా బిల్లులు చెల్లించలేదు. ఇందుకోసం ఆ ఉద్యోగి కమీషన్ డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్లు చెల్లించకపోవడంతో బిల్లుల కాగితాలు బీరువాలోనే మూలుగుతున్నాయి. పాత బకాయిలు చెల్లించకుండానే.. కొత్త టెండర్లు పిలవడం, వేలంపాట పూర్తయి, కొత్త కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయడం జరిగిపోతుంది. కానీ, పాత బిల్లులకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఆలయంలో అంతా దినసరి వేతన ఉద్యోగులు కావడం, రెగ్యులర్ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో ఆ ఉద్యోగి హవాకు ఎదురులేకుండా పోతుంది. ఈవో, సూపరింటెండెంట్ మాటను కూడా కొన్నిసార్లు వినే పరిస్థితి ఉండడం లేదని సాక్షాత్తూ ఆలయ ఉద్యోగులే వాపోతున్నారు. 'నేను పర్మినెంట్ ఉద్యోగిని, నేను చెప్పినట్లు చేయాల్సిందే' అంటూ దినసరి ఉద్యోగులు (13నెలలుగా వీరికి జీతాల్లేవు)పై జులుం చెలాయిస్తూ, ఆలయంలో అంతా తానై వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. అలాగే ప్రస్తుతం ప్రోటోకాల్ దర్శనాలకు సంబంధించిన తాళాలు కూడా ఆ ఉద్యోగి చేతిలోనే ఉన్నాయి. ఈ మధ్యనే జరిగిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మనవరాలి తల నీలాలు ఆదిత్యాలయ కార్యాలయంలోనే తీయించిన ఘటనలో తాళాలు ఆ ఉద్యోగి ద్వారానే బయటకు వచ్చాయన్నది జగమెరిగిన సత్యం. అలాగే తప్పుకు దొరకకుండా నకిలీ బిల్లులు రాయడంలో ఆ ఉద్యోగిది అందెవేసిన చేయి అని ఆలయ వర్గాలే అంటున్నాయి. రథసప్తమి ఉత్సవాలకు సంబంధించి పాసుల ప్రింటింగ్, టిక్కెట్ల అమ్మకాలు, ఆఫీసుకు రాకుండా పోయిన ఒక దినసరి ఉద్యోగి సహకారంతో ఫోన్ ద్వారానే లక్షలాది రూపాయల అవినీతికి తెరలేపారని, ఆ ఉద్యోగి నోటి దురుసుతనానికి ఆలయంలో ప్రస్తుతం ఎదురులేకుండా పోయిందని అంటున్నారు. ప్రత్యేకించి రూ.100 టిక్కెట్ల విక్రయాల్లో నేటికీ అవినీతి జరుగుతుంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి పరిస్థితులను చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.



ఘనంగా చందనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న హజరత్ బాబా బంగేష్ హుస్సేని మసీదులో బుధవారం చందనోత్సవాన్ని (ఉర్సు) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎ.రఫీ, ఇమామ్ వహబ్, షాన్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కెరటాలతో సయ్యాటలు.. రేపటి కోసం ఈత పాఠాలు!



ఎలా దూకుతానో చూడండి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చిందంటే పిల్లల ఆటపాటలకు...కేరింతలకు హద్దే ఉండదు. చెట్టూపుట్టలు...ఊరి చివరిలో చెరువులు...కావేవీ వీరి ఆటలకు అనర్హం. ఇక తీరంలోని మత్స్యకారుల పిల్లలకైతే సంద్రమే అన్నీ. ఈత పాఠాలు నేర్పే కొలనూ అదే. బతుకు పాఠాలు నేర్పే గురువూ అదే. ఉదయం...సాయంత్రం వేళల్లో పిల్లలంతా కెరటాలకు ఎదురీదుతూ... కేరింతలు కొడుతుంటారు. ఈత వారి జీవితంలో ఓ భాగం. ఎందుకంటే సముద్రమే వారికి ఆధారం. ఏకకాలంలో ఇలా ఆటల సరదా తీరడంతో పాటు జీవితానికి అవసరమైన ఈతలో మెలకువలూ నేర్చుకునేందుకు వారికి సెలవులు ఓ అద్భుత అవకాశం. ఎచ్చెర్ల మండలం బడివానిపాలెం తీరంలో బుధవారం ఇలా చిన్నారులు సందడి చేశారు.



పట్టు చిక్కింది



'జగతిమెట్ట' అక్రమాలపై రెవెన్యూ కొరడా

- తహసీల్దార్, ఇద్దరు వీఆర్‌వోలు, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ కీలకం
- అధికారుల నిర్ధారణ
- 23 చోట్ల పునాదుల తొలగింపు

టెక్కలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట దరి జగనన్న ఇళ్ల కాలనీ వ్యవహారంలో తవ్వుతున్నకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ప్రాంతంలో అధికారుల అనుమతి లేకుండానే పుట్టగొడుగుల్లా ఇళ్లు పుట్టుకొస్తుండడంతో రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి సారించారు. బుధవారం ఒక్కరోజే 23 అక్రమ పునాదులను రెవెన్యూ అధికారులు తొలగించారు. డి.పట్టా భూములుగా రైతుల ఆధీనంలో కొన్నాళ్లు ఉండడంతో ఈ స్థలంలో 70మందికి అప్పటి రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అందులో 40 ఇళ్ల స్థలాలు నకిలీవని రెవెన్యూ అధికారులు గుర్తించారు. తహశీల్దారు సహా అందరి సంతకాలను ఓ వీఆర్వో ఫోర్జరీ చేసి.. పట్టాలను అందజేశారు. అప్పట్లో అక్రమాల్లో తహశీల్దార్ బెండి గిరి, వీఆర్‌వోలు మల్లేశ్వరరావు, వైకుంఠరెడ్డితో పాటు ఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సూత్రధారులుగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి, వారిపై చర్యలకు సిద్ధమవుతున్నారు. వాస్తవాలు వెలికితీసిన తరువాత వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి రంగం సిద్ధం చేశారు. జగనన్న ఇళ్ల కాలనీలో ఇష్టారాజ్యంగా పట్టాలు జారీ చేసి... అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్క వ్యక్తినీ విడిచిపెట్టేది లేదని, వారిపై క్రిమినల్ చర్యలకు వెనుకాడబోమని ఆర్డీవో తెలిపారు. వాస్తవానికి 389 ఇళ్ల పట్టాలు ఇవ్వగా... 412 పట్టాలు పుట్టుకొచ్చాయని, ఇందులో అనర్హులకు అప్పటి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పెద్దపీట వేసి అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమాలు బయట పడతాయని, మరింతమంది రెవెన్యూ సిబ్బందిపై వేటు తప్పదన్నారు.



జగతిమెట్ట కాలనీలో అక్రమ పునాదులను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మృత్యు వేట

(5వ పేజీ తరువాయి)

ఘటనలు ఎన్నో గతంలో జరిగాయి. ప్రమాదాల్లో మృత్యువాత పడిన వారు ఉన్నారు. అటువంటి విషాద సమయాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు చాలా హామీలు గుప్పిస్తున్నారు. ఆ తరువాత వాటి గురించే మరిచిపోతున్నారు.

ఐదేళ్లలో అంతులేని నిర్లక్ష్యం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భావనపాడు హార్బర్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయ్యింది, ఇంతలో 2019లో ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం చకచకా జరిగిపోయాయి. ఆ తరువాత హార్బర్ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు మూలపేట హార్బర్ అంటూ వైసీపీ నేతలు హడావుడి చేశారు. కానీ పనుల్లో మాత్రం ఆశించినస్థాయిలో పురోగతి లేదు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మాణంతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అతీగతీ లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది.

కంటితుడుపు చర్యలే..

ప్రభుత్వ రాయితీలు, పథకాల విషయంలో మత్స్యకారులు కంటితుడుపు చర్యలకే పరిమితమవుతున్నారు. వేట నిషేధ సమయంలో అందించే మత్స్యకార భరోసా విషయంలో గత ఐదేళ్లలో అనేకరకాల అవకతవకలు జరిగాయి. వైసీపీ నాయకులు బినామీల పేరుతో లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు వచ్చినా ఎటువంటి దర్యాప్తులు అప్పట్లో లేకుండా పోయాయి. సముద్రంలో చేపలవేటలో భాగంగా మత్స్యకారులు చిన్న వయసులోనే కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి పింఛన్లు అందిస్తామన్న హామీ సైతం గత వైసీపీ పాలనలో బుట్టదాఖలైంది. సరిగ్గా వేట సాగక ఏటా వేలాది మంది మత్స్యకారులు కుటుంబాలను గ్రామాల్లో విడిచిపెట్టి సుదూర ప్రాంతాలు వలసపోతున్నారు. స్థానికంగా ప్రత్యామ్నాయ ఉపాధి లేక కొంతమంది రహదారుల పక్కన కళ్లద్దాలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. జిల్లాలో హైవేతో పాటు ప్రధాన రహదారుల వెంబడి కనిపించే దుకాణాలు ఎక్కువగా మత్స్యకారులవే. కనీసం మత్స్యకార గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా జరగని దుస్థితి. కనీసం పక్క గ్రామాలు, మైదాన ప్రాంతాల్లోనైనా ఉపాధి పనులు కల్పించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుతున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేటకు వెళ్లకపోతే పస్తులే

వేటకు వెళ్తేనే కుటుంబానికి పూట గడిచేది. లేకుంటే పస్తులే మిగులుతాయి. తుఫాన్లు, వాతావరణం సరిగ్గా లేనప్పుడు రోజుల తరబడి ఇంటి వద్దే ఉండిపోతాం. కనీసం ఉపాధి హామీ పనులు ఉంటే కొంత ఇబ్బందులు తీరుతాయి. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉపాధి పనులు మాత్రం కల్పించడం లేదు.

- చలపరాయ గురుమూర్తి, మత్స్యకారుడు, డొంకూరు

ఇబ్బంది పడుతున్నాం..

స్థానికంగా వేట గిట్టుబాటు కావడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఉన్న గ్రామాల్లో కుటుంబాలను విడిచిపెట్టి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం పూర్తిచేయాలి.

- బుడ్డ కూర్మారావు, మత్స్యకారుడు, డొంకూరు

గంజాయిపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

కల్పిస్తామన్నారు. పోలీసు వాహనాలు, ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను అందిస్తామని తెలిపారు. విద్యాలయాలు, గృహ సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలు, ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ఏఎస్పీలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, డీఎస్పీలు సీహెచ్.వివేకానంద, వీవీ అప్పారావు, శేషాద్రి, రాంబాబు, భవ్యరెడ్డి, రాఘవులు, శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ ఇమాన్యుయల్ రాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- 'మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల పులివెందుల పర్యటనకు వెళ్లారు. ఆయన ప్రతిపక్ష నేత కానప్పటికీ హెలికాప్టర్‌లో వచ్చినప్పుడు 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం' అని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. హెలికాప్టర్ విషయమై చేస్తున్న రాద్ధాంతం గురించి జగనే ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పులివెందులకు వెళ్లిన హెలికాప్టర్‌లోనే మళ్లీ పది నిమిషాలు ఎలా వెళ్లగలిగారని ప్రశ్నించారు. ఈ విషయమై ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



హోంమంత్రి చేపట్టిన సమీక్షలో పాల్గొన్న జిల్లాలోని పోలీసు అధికారులు

ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించాలి

● శ్రీకాకుళంలో బాధితురాలిని పరామర్శించిన హోంమంత్రి అనిత


లత్రశీతో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

శ్రీకాకుళంక్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించాలని హోంమంత్రి అనిత సూచించారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శివాలయం వీధిలో నివాసముంటున్న లతశ్రీని కలిశారు. తొమ్మిదేళ్లుగా లతశ్రీ క్యాన్సర్‌తో బాధపడుతోంది. కొంతకాలంగా యూట్యూబ్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత వీడియోలు విని ఆమె స్ఫూర్తితో కోలుకుంటోంది. డాక్టర్లు సైతం మందులకు స్పందించని లతశ్రీ హోంమంత్రి మాటలకు స్పందిస్తుండడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆమె భర్త ఆనంద్ తన భార్య కోరికను తీర్చాలని హోంమంత్రిని కోరాడు.దీంతో స్పందించిన హోంమంత్రి అనిత బుధవారం జిల్లాలో పర్యటించిన సందర్భంగా లతశ్రీ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. నిత్యం టీవీలో కనిపించే స్ఫూర్తిదాత తన ఇంటికి రావడంతో ఆమె ఆనందానికి అవధులులేకుండా పోయాయి. లతశ్రీని కలిసిన హోంమంత్రి పలకరించి ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనితను కలవడం తన కల అని, ఆరోగ్యం క్షీణించడంతో భర్త, పిల్లలను కనీసం నోరు తెరిచి పిలవలేకపోతున్నాని లతశ్రీ హోంమంత్రి వద్ద విలపించింది.లతశ్రీ వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిఫర్ చేస్తానని హోంమంత్రి భరోసాఇచ్చారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో ఆమె మాట్లాడారు. తక్షణం సీఎంతో మాట్లాడతామని అందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా తొలుత అనితను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ కలిశారు.

మార్కెట్ తరలింపుపై అపోహలు వద్దు

● శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్


అరసవల్లి: వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ తరలింపుపై ఎవరూ ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులో గల జిల్లా టీడీపీ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్ద మార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైన తర్వాతే ప్రణాళిక ప్రకారం నిర్మాణానికి ముందుకు వెళ్తామని తెలిపారు. తుది జాబితాలో ఉన్న వ్యాపారులందరికీ స్థలాల కేటాయింపుపై కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తరువాతనే మార్కెట్‌ను తరలిస్తామన్నారు. వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు మార్కెట్‌ను పట్టించుకోలేదని, వారి సవతితల్లి ప్రేమను నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి తక్షణ పరిష్కారానికి కృషి చేయడమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే గొండుశంకర్ తెలిపారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు.

●గార ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) శిలగాంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

జి.సిగడాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తెలిపారు. బుధవారం గెడ్డకంచరాంలో నమస్తే ఎచ్చెర్ల--మన ఊరికి మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు.అనంతరం గ్రామంలో నిర్మించిన పలు సీసీ రహదా రులను ప్రారంభించారు. గ్రామస్థుల నుంచి పలు వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణు మూర్తి, వజ్జపర్తి సర్పంచ్ పి.లలితకుమారి, బగ్గు జ్ఞానేశ్వరరావు, నక్క మురళి, ఎం.రాము, టంకాల మౌళీశ్వరరావు, కూనుబిల్లి కూర్మారావు, జక్కంపూడి దాసు, కుదిరెళ్ల బుజ్జి, మజ్జి కన్నంనాయుడు పాల్గొన్నారు.


రైతురథం ప్రారంభిస్తున్న ఎన్ఈఆర్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్‌లోని కనుగువలస ఫీడర్‌పరిధిలో మరమ్మతులు,చెట్టుకొమ్మలు తొలగించనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కనుగులవలస, వెంగళరావుకాలనీ, గేటు ప్రాంతం, పాత ఆమదాలవలస, రావికంటిపేట, కుద్దిరాంకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

న్యాక్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయం దగ్గరలో గల నేషనల్ అకాడమీ ఆఫ్‌కనస్ట్రక్షన్స్(న్యాక్)ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులోశిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7893227705ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌టీసీ సర్టిఫికెట్ల కోసం..

ఎచ్చెర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):గుర్తింపు పొందిన సంస్థల్లో మూడేళ్ల అనుభవంఉన్న నాన్‌టెక్నికల్ సిబ్బంది ఎన్‌టీసీ సర్టిఫికెట్లు పొందేందుకు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐప్రిన్సిపాల్, జిల్లాఅడ్మిషన్ల కన్వీనర్ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

కంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ కోరారు. బుధవారంమండలంలోని రేఖాదేవిపురం, డోలగోవిందపురం ఉపాధి వేతనదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటి జి వాసుదేవరావు, టి.ఢిల్లీరావు పాల్గొన్నారు.

సైక్లోన్ భవన నిర్మాణానికి పరిశీలన

సోంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చేపలగొల్లగండి తదితర మత్స్యకార గ్రామాల్లో మల్టీపర్పస్ సైక్లోన్ భవనాల నిర్మాణానికి డిప్యూటీ ఫిషరీస్ డైరెక్టర్ వై.సత్యనారాయణ బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ మేరకు మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు జనసేన నాయకులు గుండుపల్లి చిన్నరాజారావు కలిశారు.

రాజారావు కవితకు బహుమతి

ఆమదాలవలస, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు రచించిన సదాపదిలం కవితకు ద్వితీయ బహుమతి లభించింది. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని చివటం సంగీత సాహిత్య కళా వేదిక రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు నిర్వహించింది.ఈ మేరకు పోటీల నిర్వాహకురాలు గుండాల గీతామహాలక్ష్మి సమాచారం పంపారు. 126 మంది కవితులు పంపగా రాజారావుకు ద్వితీయ బహుమతి లభించడంతో పలువురు కవులు అభినందించారు.

ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమించాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):ప్రజా వ్యతిరేక పాలనపై ఉద్యమించాలని కేఎన్‌పీఎస్ నాయకులు రాకోటి రాంబాబు, దుప్పాడు రాజులు కోరారు. బుధవారం చింతాడలో కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమం లో మాట్లాడుతూ పూలే జయంతి నుంచి అంబేద్కర్ జయంతి వరకు దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కరానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహించారు.కార్యక్రమంలో మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, నూక రాజు, గొండు రమణ, నాగళ్ల మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

డేటా సేకరణలో ఇచ్ఛాపురం ప్రథమస్థానం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికకు సంబంధించి 2025-26 క్షేత్రస్థాయిలో డేటా సేకరణలో ఇచ్ఛాపురం ప్రథమస్థానంలో నిలిచినట్లు ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. బుధవారం ఇచ్ఛాపురంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్వే కరెక్టుగా చేయని వీవోఏలు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించడం తగదు

పొందూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సర్వేలకు సంబంధించిన బాధ్యతలను సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు మాత్రమే అప్పగించడం తగదని పొందూరు మండలంలోని కార్యదర్శులు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో మన్మథరావుకు కార్యదర్శులు మోహన్‌బాబు, పి.జగదీష్, రాజీవ్,శ్రీనివాసరావు, రామకృష్ణ, జనార్దనరావు, శ్రీను వినతిపత్రం అందజేశారు.

రామాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోగల ప్రధాన ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని దాసన్నపేట జంక్షన్ వద్ద గల రామాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఎస్‌హెచ్‌జీ సంఘాల పనితీరు పరిశీలన

లావేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) ఎస్‌హెచ్‌జీల పనితీరును ఒడిశాకు చెందిన భవిత మహపాత్రో ఎస్ఎల్ఆర్ఎం అడిషనల్ సీఈవో సంకల్పరథ్ పరిశీలించారు.ఈ మేరకు బుధవారం మురపాక గ్రామ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. తామాడలో మహిళలు చేపడుతున్న వ్యాపార కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం లావేరు మండల మహిళా సమాఖ్యలో సీఆర్‌పీల విధులు గురించి అడిగి తెలుసుకున్నారు.

ముక్తింపురంలో పోలీస్ పికెట్

రణస్థలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తింపురంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.ఇటీవల ఓ దైవ కార్యక్రమం పురస్కరించుకుని నెలకొన్న సంఘటన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఓ వర్గం మరో వర్గంవారి ఇంటిపై దాడికి దిగే పరిస్థితి ఏర్పడింది.ఓ వ్యక్తి బుధవారం ప్రత్యర్థి వర్గంపై దాడిచేశాడు.ఈ ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. ఈ మేరకు ఇరు వర్గాల ఫిర్యాదుతో జేఆర్‌పురం పోలీసులు పికెట్ ఏర్పాటుచేశారు.

వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపచేయాలని జిల్లా యూనియన్ అధ్యక్షుడు పి.త్రినాథరావు కోరారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత గలవారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

ఆదిత్యాలయంలో స్థాలీపాక హోమం

అరసవల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ అనివెట్టి మండపంలో బుధవారం సాయంత్రం ఆగ్నేయ స్థాలీపాక హోమం,స్వామి వారి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఆదిత్యునికి విశేష భోగాలు సమర్పించారు. అనంతరం శ్రీ సత్యసాయి స్వరసుధ బృందంఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఫణీంద్రశర్మ, సాంబమూర్తి, వికాస్ శర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శ్రీకాకుళం డివిజన్‌కు చెందిన రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే, పీజీఆర్ఎస్, పౌరసేవలపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.గ్రామస్థాయిలో భూముల రీసర్వే ప్రక్రియను పటిష్ఠంగాఅమలు చేయాలని కోరారు.వాటర్‌ట్యాక్స్ వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రజల అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకుని, సేవల నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష పాల్గొన్నారు.

ఈఎస్ఐ బీమాతో కార్మికులకు ఆసరా

● ఈఎస్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ప్రజ్ఞ


పింఛన్ పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

రణస్థలం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):కార్మిక కుటుంబాలకు ఈఎస్ఐబీమా ఆసరాగా ఉండి ఆదుకుంటుందని ఈఎస్ఐసీ బ్రాంచ్‌మేనేజర్ ఎస్.ప్రజ్ఞ తెలిపారు. పైడిభీమవరం డాక్టర్ రెడ్డీపరిశ్రమలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన పూడి చిన్నంనాయుడు తల్లిదండ్రులకు బుధవారం శ్రీకాకుళం ఈఎస్ఐకార్యాలయంలో పింఛన్‌కు సంబంధించిన పత్రాలను అందజేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూఈఎస్ఐ బీమాదారులు విధి నిర్వహణ, విధులకు వెళ్లిన సమయంలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందినా వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ బీమా పింఛన్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బొడ్డేపల్లి రవీష్, కాంట్రాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని పూజలు

జి.సిగడాం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): జి.సిగడాంలోని శివాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి విశ్వక్‌సేన్ బుధవారం పూజలు చేశారు. మార్క్‌శంకర్ సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న విషయం విదితమే. కార్యక్రమంలో జనసేన నాయకులు అర్జున్‌కుమార్, తాలబత్తుల పైడిరాజు, మండల నాయకులు పొగిరి అప్పలనాయుడు, ఎర్నేన శ్రీరామ్, పైల శివకుమార్, పోతల భాగ్యరాజ్ పాల్గొన్నారు.

●రణస్థలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్‌శంకర్ కోలుకోవాలని రణస్థలంలోని అయ్యప్ప ఆలయంలో జనసేన నేతలు విశ్వక్సేన్, వడ్డాది శ్రీను, మైలుపల్లి రాంప్రసాద్, సువ్వాడ రామారావు, దన్నాన రవీంద్ర, రమణ చిన్న సరేష్, స్వన్న పూజలు నిర్వహించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో ఓ హత్య కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద కథనం మేరకు.. 2024 డిసెంబర్ 15న బోర ఈశ్వరరావు ఎచ్చెర్లగ్రామంలో అనుమానాస్పదంగా చనిపోయాడు. దీంతో ఎచ్చెర్ల పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం తరలించారు. ఈ విషయంపై దర్యాప్తు నిర్వహించిన సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌లు పోస్టుమార్టంలో విషంతో పాటు గొంతు నులమడం వల్ల చనిపోయాడని తెలియడంతో ఈ ఏడాది ఏప్రిల్ 7న ఈ కేసును హత్యగా మలిచారు.అనంతరం ఈ విషయంపై అన్నికోణాల్లో దర్యాప్తు చేపట్టిన సీఐకి పలు విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. గ్రామంలో బోర ఆదినారాయణ కుమారుడు బోర సాయి గిరిధర్ రెడ్డి(24) 2024 జులై 11న మలేరియాతో బాధపడుతూ చనిపోయాడు. ఆయన మృతికి బోర ఈశ్వరరావు చిల్లంగే కారణమన్న అనుమానంతో పథకం ప్రకారం ఆదినారాయణ ఆయన తమ్ముడు బోర సంజీవరెడ్డి మేనల్లుడు నగిరెడ్డి గోవింద్‌లు పొలానికి వెళ్తున్న ఈశ్వరరావును గొంతు నులిమి అనుమానం రాకుండా ఉండేందుకు నోట్లో విషం పోసి హత్య చేశారు. ఈ మేరకు బుధవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కేసును ఛేధించిన సీఐ అవతారం,సహకరించిన ఎస్ఐ సందీప్‌ను ఎస్పీ అభినందించారు.

కంచిలిలో శ్రీరామనవమి వేడుకలు

కంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కంచిలి రైలు నిలయంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.ఈ మేరకు వేడుకల్లో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కమిటీ సభ్యులు జగదీష్ పట్నాయక్, లోళ్ల సూర్యనారాయణ, ఉన్నారు.

● కవిటి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): కుసుంపురానికి చెందిన బి.సత్యవర ప్రసాద్ ఉగాది పురస్కారం అందుకోవడంతో రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్ బి.అశోక్ సన్మానించారు.ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ సత్యవరప్రసాద్ బెనారస్ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, మృదంగ విద్వాంసులుగా ప్రసిద్ధి కెక్కారన్నారు.

వన్యప్రాణులను రక్షించాలి

ఇచ్ఛాపురం,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి):వన్యప్రాణులను రక్షించాలని కాశీబుగ్గ డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము కోరారు. మునిసిపాలిటీ పరిధిలోగల రత్తకన్న కొండ ప్రాంతం నుంచి ఇటీవల చుక్కల దుప్పిలు ఎక్కువగా తాగునీరు, ఆహారం కోసం జనావాసాల్లోకి వస్తున్న సమయంలో కుక్కల దాడిలో మృతిచెందుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం రత్తకన్నలో వన్యప్రాణుల రక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ క్రమంలో బుధవారం ఉదయంకొండల్లో నుంచి దారి తప్పి రత్తకన్నలోకి వచ్చిన జింకను స్థానికుల సహకారంతో జలంత్రకోట ఆర్ ఎఫ్‌లో సురక్షితంగా విడిచిపెట్టినట్లు రాము తెలిపారు.

తప్పుడు ధ్రువపత్రంపై కేసు నమోదుచేయాలి

పొందూరు,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోకర్ణపల్లికి చెందిన సర్వే నంబరు 33-2పి పై మంజూరుచేసిన తప్పుడు ధ్రువపత్రంపై జిల్లా ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయనున్నట్లు టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సీపాన శీరంగనాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.మంజూరైన ధ్రువపత్రం ఫేక్‌పత్రమని తేలిందని,దాంతో నిర్మాణం చేపట్టినవారిపై తహసీల్దార్ క్రిమినల్‌కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు.

పురుషోత్తపురంలో ఇంటింటా సర్వే

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని పురుషోత్తపురం 1, 2 వార్డుల్లో డయేరియా కేసుల నేపథ్యంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటా సర్వే ప్రారంభించారు. బుధవారం వార్డులో ప్రతి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి మందులు అందజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ జూహిత వైద్య పరీక్ష నిర్వహించారు.

ఈ-కేవైసీ పూర్తిచేయాలి

కంచిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషిచేయాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ కోరారు. బుధవారం కంచిలిలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు కె.నాగరాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు

గుజరాతీపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోపార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామని, సంస్థాగత నిర్మాణంపై దృష్టిపెట్టామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన క్రియాశీల సభ్యుల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా 11 ఏళ్ల వికసిత్ భారత్ దిశగా ప్రధాని నరేంద్ర మోడి ప్రయాణంపై అసెంబ్లీ కన్వీనర్ పైడి వేణుగోపాలం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, పైడి సింధూర, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, సీహెచ్ దుర్గారావు గాంధీ, పి.సూర్యకుమారి, సురేష్ బాబు సింగ్ పాల్గొన్నారు.

●ఇచ్ఛాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బీజేపీ పూర్తిస్థాయిలో బలోపేతానికి కార్యకర్తలు కష్టపడాలనిఆ పార్టీ జిల్లా ట్రేడ్ సెల్ కన్వీనర్ జి.సాయికామేష్ కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవరావు, పాలవలస వైకుంఠరావు, బుద్దాల నిర్మలారెడ్డి, మంగి లక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి తెలిపారు. బుధవారం జి.సిగడాం, అద్వానంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతి- కాట్పాడి రైల్వే డబ్లింగ్‌కు ఆమోదం

శ్రీకాకుళం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధికి చర్యలు వేగవంతం అవుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ డబ్లింగ్ ప్రాజెక్టు ఆమోదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వేమంత్రి అశ్విన్‌శ్రీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ ప్రాజెక్టు ద్వారా తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట అనుసంధానంకావడంతోపాటు వెల్లూరు, తిరుపతి వంటి విద్యావైద్య కేంద్రాలకు ప్రాజెక్టు ఎంతోమేలు చేకూర్చుతుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు వ్యవసాయ, ఆర్థిక వ్యవస్థలను బలపరచడంతోపాటు ఏపీలో ఎలక్ట్రానిక్స్, సిమెంట్, ఉక్కు పరిశ్రమల వృద్ధిని వేగవంతం చేస్తుందని తెలిపారు.

కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి హామీ

అరసవల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీఇచ్చారు.ఈ మేరకు బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా పంచాయితీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ట అమర్‌నాథ్, అసోసియేట్ అధ్యక్షుడు ఎర్నేనజ్యోతి శ్రీనివాస్, సెక్రటరీ గొండు తిరుమలరావు, సోమేశ్వర రావు, శ్రీనిరెడ్డి, హిమబిందు, మదన్‌మోహన్, ప్రహ్లాద్ కలిశారు.


వంట గ్యాస్ ధరను తగ్గించాలి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలకు పెంపునకు నిరసనగా ఎచ్చెర్లలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ బండను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పి.తేజేశ్వరరావు, డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, బి.రాము, టి.రామారావు, మోహన్ పాల్గొన్నారు.

● అరసవల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు భవిరి కృష్ణమూర్తి, పి.ప్రసాదరావు, ఆర్.ప్రకాశరావు, బి.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఏ.సత్యం, ఏ.సోమశేఖర్, ఎం.ఆదినారా యణమూర్తి, ఎల్.మహేష్, బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

●ఆమదాలవలస, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పారి శ్రామికవాడ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు,జనార్దనరావు, సూర్యనారా యణ, బి.హేమసుందర్, బి.రమణమూర్తి, జి.లోకేష్ పాల్గొన్నారు.







ఎంబీబీఎస్ పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్ట్

శ్రీకాకుళంక్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కజకిస్తాన్‌లో ఓ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్‌లో చేర్పించి ఫీజులను యూనివర్సిటీకి చెల్లించకుండా మోసం చేయడంతో తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన గంగాధర్ హరీష్‌ను బుధవారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్‌కు చెందిన గంగాధర్ హరీష్ ఎంబీబీఎస్‌లో చేర్పించి ఫీజులను యూనివర్సిటీకి చెల్లించకుండా మోసం చేశాడని శ్రీకాకుళానికి చెందిన అన్నెపు నానాజీ టూటౌన్ పోలీసులకు 2024 ఆగస్టులో ఫిర్యాదు చేశాడు. గతేడాది జూలై 29న ఎస్పీ గ్రీవెన్స్‌లో గంగాధర్ హరీష్ ఏడుగురు విద్యార్థులను కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదివిస్తానని ఒక్కక్కరి నుంచి రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేసి పరారయ్యాడని బాధితులు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు సమీపంలోని పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో టూటౌన్ సీఐ పి.ఈశ్వర రావు హరీష్ కోసం గాలించారు. దొరక్క పోవడంతో సీఐడీ ద్వారా లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఢిల్లీ విమానశ్రయంలో శనివారం రాత్రి ఎయిర్ పోర్ట్ పోలీసులకు గంగాధర్ హరీష్ పట్టుబడ్డాడు. నిందితుడిని తీహార్ జైలుకి తరలించి, శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని బుధవారం జిల్లాకు తీసుకొచ్చిన టూటౌన్ పోలీ సులు విచారణ అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నెల్లూరులో రోడ్డు ప్రమాదం

● నరసన్నపేట వాసి మృతి


హరినాథ్‌కుమార్ (ఫైల్)

నరసన్నపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాయుడు వీధికి చెందిన నాయుడు హరినాథ్‌కుమార్ (47) నెల్లూరులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నెల్లూరులో ఒక ప్రైవేటు బ్యాంకు మేనేజర్ పనిచేస్తున్న హరినాథ్ కుమార్ విధులు ముగించుకుని తిరుపతిలో తన స్వగృహానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుక్కలు ఒక్కసారిగా అడ్డురావడంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అతని తలపై బలంగా గాయాలై మృతిచెందినట్లు సోదరులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. దీంతో స్వగ్రామం నరసన్నపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. హరినాథ్ కుమార్ మృతిపై స్నేహితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధం

నరసన్నపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తోటాడ గ్రామంలో సుమారు 30 ఎకరాలకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పెద్దని రమణయ్య, కొంకేన తిరుపతిరావు కల్లంలో గడ్డి కుప్పలను పెట్టారు. ఆ మార్గంలో వ్యవసాయ పంపు సెట్లకు వెళ్లే విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఆ వైర్లకు షార్ట్ సర్క్యూట్ అయి గడ్డివాములపై నిప్పులు పడడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. క్షణాల్లో మంటలు వ్యాపించి గడ్డివాము దగ్ధమైంది. ఘటన జరిగిన వెంటనే స్థానికులు మంటలు వ్యాపించకుండా సహాయక చర్యలు చేపట్టడంతో సమీపంలో ఉన్న ధాన్యం బస్తాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. వీటిని సంరక్షించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సుమారు రూ.2 లక్షల విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైందని బాధిత రైతులు వాపోతున్నారు. ఘటనా ప్రాంతానికి ట్రాన్స్‌కో ఏఈ పి.బాలకృష్ణ సందర్శించిన పరిశీలించారు. విద్యుత్ వైర్ల మార్గాన్ని గ్రామ శివారు నుంచి వ్యవసాయపంపు సెట్లకు ఇస్తామన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడి మృతి




కోటబొమ్మాళి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం-తిలారు రైల్వే స్టేషన్ మధ్యలో బుధవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస జీఆర్పీ హెచ్‌సీ డి.హరినాథ్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, తెల్లని గళ్ల షర్టు, నలుపు రంగు ఫ్యాంటు దరించి చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 8985021143 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్‌కు కేటుగాళ్ల టోకరా

హరిపురం ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మందస పట్టణానికి చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్ శ్రీనివాస్ పాడికి సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేసి రూ.60వేలు దోచుకున్న ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి పాడికి ఫోన్ చేసి మేం పోలీసులమని, మందస ఎస్ఐకి అత్యవసరం గా రూ.60 వేలు అవసరమని చెప్పారు. నగదు సార్ వద్ద ఉందని, మీరు ఫోన్‌పే చేస్తే కానిస్టేబుల్ ద్వారా నగదు పంపిస్తామని నమ్మబలికారు. దీంతో శ్రీనివాస్‌పాడి సదరు నెంబరుకు రూ.60 వేలు ఫోన్‌పే చేసి ఫోన్ వచ్చిన నెంబరుకు విషయం చెప్పాడు. నగదు పంపించమని కోరాడు. ఐదు నిమిషాల్లో మీముందు నగదుతో ఉంటామని సదరు వ్యక్తులు చెప్పారు. గంట గడిచినా వ్యక్తి రాకపోయేసరికి ఫోన్ చేయగా అప్పటికే ఆ నెంబరు స్విచ్ఛాప్ అయ్యింది. దీంతో పాడి లోబోదిబోమని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మందస పోలీ సులు దర్యాప్తు చేపడుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వస్త్ర వ్యాపారి మృతి

● ధర్మపురం బావిలో మృతదేహం గుర్తింపు


కిశోర్(ఫైల్)

పొందూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొందూరుకు చెందిన వస్త్రవ్యాపారి ఉండ్రాళ్ల కిషోర్ కుమార్(50) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ధర్మపురం సమీపంలోని ఓ బావిలో మృతదేహాన్ని బుధవారం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి కిశోర్‌కుమార్‌గా గుర్తించారు. కిశోర్ కుమార్ మంగళవారం రాత్రి ధర్మపురంలో బాకీలు వసూలుకు వెళ్లాడని, బావిలో పొరపాటున కాలుజారి పడిపోయి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య అనూష భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కె.కపాసుకుద్దిలో విద్యార్థిని ఆత్మహత్య

కవిటి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కె.కపాసుకుద్ది గ్రామానికి చెందిన విద్యార్థిని ఎస్.అపూర్వ(13) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. అపూర్వ తరచూ అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురవుతుండేది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లి హేమలత గమనించి స్థానికుల సాయంలో ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతిచెందింది. తండ్రి కుమారస్వామి వలస కూలీగా పనిచేస్తున్నాడు. అపూర్వ తల్లితో ఉంటూ కవిటిలో ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేశారు.

మహిళపై దాడి

సోంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కొర్లాం గ్రామానికి చెందిన బంగారు దమయంతిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి దాడిచేసి బంగారు నగలు అపహరించారు. స్థానికులు, బారువ పోలీసుల కథనం మేరకు.. దమయంతి హుకుంపేటలో పాలు అమ్ముకుని ఇంటికి వెళ్తోంది. ఆసమయంలో గుర్తు తెలియని వ్యక్తి తలపై దాడిచేసి గాయపరిచాడు. చెవి, ముక్కుకు ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాడు. విషయం తెలుసుకున్న సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ పథకాలు


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమ స్యలు విన్నవించుకున్నారు. సమస్యలపై మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రధానంగా ఇళ్లు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిధులున్నందున సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

నరసన్నపేట/పోలాకి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వ హించి వినతులు స్వీకరించారు. తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలని గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టా లని ప్రజలు వినతిపత్రాలను అందించారు. ఈ వినతులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

పాతపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రధానంగా తాగునీటి సమస్యలపై సత్వర చర్యలుండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు

మెరుగైన సేవలు అందించాలి

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లను కోరిన ఎమ్మెల్యే శిరీష


ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్నచౌదరి

పలాస, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో ఆర్టీసీ సేవలు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు బస్సులు కేటాయించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారా యణను విజయవాడలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. పలాస నియోజకవర్గంలో అధిక సంఖ్యలో విద్యార్థులు చదువులకోసం పలాస-కాశీబుగ్గ వస్తుంటార ని, సరైన బస్సు సౌకర్యం లేక వారు ఇబ్బం దులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గ్రామాలు కూడా ఎక్కువగా ఉన్నం దున సర్వీసులను పెంచాలని కోరారు. ఆమెతో పాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్నచౌదరి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు త్వరితగతిన అనుమతులు

● పట్టణ ప్రణాళిక ప్రాంతీయ డైరెక్టర్ పి.నాయుడు


మాట్లాడుతున్న టౌన్‌ప్లానింగ్ ప్రాంతీయ డైరెక్టర్ నాయుడు

పలాస, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే అనుమతులిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విశాఖ రీజియన్ పట్టణ ప్రణాళిక ప్రాంతీయ డైరెక్టర్ పి.నాయుడు ఆదేశించారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, సచివాలయ ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్ర మ నిర్మాణాలకు తావివ్వ వద్దన్నారు. ప్లాన్‌లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిలో లోటుపాట్లను దరఖా స్తుదారులకు వివరించి ఆ తరువాత ప్లాన్‌లను మంజూరు చేస్తే ఎటువంటి అక్రమాలకు తావు ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ అనుమతులు సులభతరం చేసిందని, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే నిబంధనల మేరకు అనుమతులిస్తున్నా మన్నారు. సమావేశంలో కమిషనర్ ఎన్. రామారావు, ఏడీటీపీ శ్రావణి, డీటీసీపీ కృష్ణ, టీపీవో వరప్రసాద్, టీపీఏ సంతోష్, సర్వేయర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

కాశీబుగ్గ/టెక్కలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తక్షణం తగ్గించాలని సీపీఎం జిల్లా ప్రతినిధులు కె.మోహనరావు, నంబూరు షణ్ముఖరావు డిమాం డ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాశీబుగ్గ, టెక్కలిల్లో ఆ పార్టీ నేతలతో కలిసి నిరసన తెలిపారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా ఈ భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నేతలు గణపతి, సుహాసిని, ఢిల్లేశ్వరి, అజయ్ కుమార్, బాలాజీ, కొల్లి ఎల్లయ్య, బగాది వాసుదేవరావు, బొంతా ధర్మారావు, హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ, టెక్కలిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సన్మార్గంలో పయనించాలి

● ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ

కొత్తూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సృష్టిలో అవతారాలు ఎన్ని ఉన్నా దేవుడు ఒక్కరేనని ఈ సత్యాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించేందుకు భక్తిభావం పెంపొందించు కోవాలని ఆధ్యాత్మికవేత్త, వాగ్దేవీ వర పుత్ర సామవేదం షన్ముఖ శర్మ అన్నారు. కొత్తూరు వేంకటేశ్వర ఆలయంలో బుధవారం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ తనకు తాను ఆనందంగా ఉండి ఇతరులను ఆనందంగా ఉండేలా చూసుకోవాలన్నారు. భక్తిని పెంపొందించు కోవడం ద్వారా ముక్తిమార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ప్రచార కులు పొగిరి రవి, ఎల్.తులసీ వరప్రసా దరావు, ఎల్.లక్ష్మీ నారాయణనాయుడు, పలువురు భక్తులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

కంటి శస్త్రచికిత్సలకు 23 మంది ఎంపిక

హరిపురం ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మందస సత్యసాయి మందిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు వెంకటరమణ 42 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 23 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మందిరం కన్వీనర్ ఈశ్వరరావు, రామారావు, అరుణకుమారి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి కొల్లవానిపేట గేటు మూత

నరసన్నపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొల్లవానిపేట వద్ద ఉన్న రైల్వే గేటు గురువారం ఉదయం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు మూసివేస్తున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలి పారు. ఉర్లాం-శ్రీకాకుళం రోడ్డు మార్గంలో లైనింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు కొల్లవానిపేట రైల్వే గేటును పూర్తిస్థాయిలో మూసివేయడం జరుగుతుందన్నారు. అందువల్ల కామేశ్వరిపేట, కొల్లవానిపేట, వెంకటాపురం తదితర గ్రామాలకు వెళ్లేవాహనాలను నడగాం అండర్ పాసేజ్ మీదుగా మళ్లించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు కొల్లవానిపేట మార్గంలో నడిపేందుకు అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

కాశీబుగ్గ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు తోట సిమ్మయ్య, రుంకు రామారావు, తిరుపతి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస జంక్షన్ వరకు డప్పులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, గణపతి సంఘీ భావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు జనార్దన, నాగేశ్వరరావు, చరణ్, భగీరధి, హరికృష్ణ పాలల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

హరిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజి అధికారి మురళీకృష్ణం నాయుడు అన్నారు. చీపి, పిల్లి బుడార్సింగి, కృష్ణాపురం గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణపై బుధవారం ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులను రక్షించుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో నీరు లేక మైదాన ప్రాంతాల్లోని చెరువులు, కాలువల వద్దకు నీటి కోసం వచ్చే ప్రాణులకు హాని తలపెట్టవద్దన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు రాము, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని జీసీడీవో నీరజ అన్నారు. లక్ష్మీనర్సుపేట కేజీబీవీని బుధవారం సందర్శించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటఅంబిక, ఎస్ఎంసీ చైర్ పర్సన్ కె.నాగమణి, వైస్ చైర్మన్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి చర్యలు

టెక్కలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కింజరాపు ఎర్రన్నాయుడు రక్షిత నీటి పథకం సమీపంలో ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటకులను ఆకటుకునేలా టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు టూరిజం, రెవెన్యూశాఖ అధికారులు బుధవారం పరి శీలించారు. పార్కు సుందరీకరణ, బోటింగ్, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు తయా రుచేయనున్నట్లు తెలిపారు. జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భావనపాడు బీచ్..

సంతబొమ్మాళి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): భావనపాడు బీచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక చేపడుతున్నారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో పర్యాటకశాఖ ఈఈ కె.రమణ, ఏఈఈ మదన్‌మోహన్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు బుధవారం భావన పాడు బీచ్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. అతిథి గృహం, విశ్రాంతి గదులు, పిల్లల పార్కు, ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అప్పలరాజు, డీటీ హరి పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

పాతపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే రీ సర్వే లక్ష్యమని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. గురండి గ్రామంలో బుధవారం రీసర్వే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడత భూ సర్వే నిమిత్తం గంధం సరియా, గురండి గ్రామాలను ఎంపికచేయడం జరిగింద న్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, రెవెన్యూ సర్వే అధికారులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

పలాసరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పలాస ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు అన్నారు. శాసనం గ్రామంలో బుధవారం సారా నిర్మూలనపై నవోదయం-2.0 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనారాయణ, వీఆర్వో కల్యాణి, ఏఎస్ఐ ఎం.గోవిందరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసన్నపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్‌లు, మత్తుకు బానిసలైతే జీవితాలు నాశనమౌతాయని టెక్కలి సబ్‌డివిజన్ శక్తి యాప్ టీం ఎస్ఐ వి.బాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానికంగా ఓ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్ వినియోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారావు, శక్తి యాప్ టీం సభ్యులు పాల్గొన్నారు.

● టెక్కలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ కె.రాము అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ, వినియోగం వల్ల కలిగే నష్టాలపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సబ్ స్టేషన్ పరిధిలోని గోపాలపురం, చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

హరిపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లబినాన లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రవే శాలకు ఉదయం ఉదయం 10గంటల నుంచి 12 వరకు, 5వ తగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దర ఖాస్తు చేసుకున్న విద్యార్థినులు హాల్ టిక్కెట్‌తో పాటు గుర్తింపునకు ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు.

రేపు ఐతమ్‌లో జాబ్‌మేళా

టెక్కలి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం తెలంగాణా ఓవర్సీస్ మేన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ జాబ్‌మేళా నిర్వహిస్తుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థకు తెలంగాణా ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ గుర్తింపు ఉందన్నారు. సౌదీఅరేబియా, కతార్, యూకే, కెనడా, జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, యూఎస్‌లో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. 40 ఏళ్ల వయసు కలిగి ఆసక్తి, అనుభవం, లేదా అనుభవం లేని అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చన్నారు. సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరు కావాలని కోరారు.

వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలి

పలాసరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాధరావు, జిల్లా కార్యదర్శి కె.రమణ మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యా లయలో బుధవారం ఏవో పాపా రావుకు వినతి పత్రం అందజేశారు. నామినీ వీఆర్ ఏలను రెగ్యులర్ చేయాలని, వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరు పతిరావు, సింహాచలం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురానికి చెందిన వివాహిత ఆత్మహత్య


భాగమతి (ఫైల్)

పుట్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పుట్లూరు మండలం గాండ్లపాడు గ్రామంలో భాగమతి (32) కుటుంబ కలహాలతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన భాగమతితో గాండ్ల పాడుకు చెందిన రామేశ్వరరెడ్డికి ఏడేళ్ల కిందట వివాహమైంది. ఇతను గతంలో తాడిపత్రిలో ఫొటోస్టుడియోలో పనిచేసే వాడు. ప్రస్తుతం పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అప్పు తీసుకున్నవారు సకాలంలో చెల్లించక పోవడంతో ఒత్తిడి తాళలేక మద్యానికి బాని సయ్యాడు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఈ క్రమం లోనే దంపతుల మధ్య కలతలు మొదల య్యాయి. ఈ పరిస్థితులన్నింటితో మనస్తాపం చెందిన భాగమతి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసు కొని ఆత్మహత్య చేసుకుంది. తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకట నరసింహం మృతదేహాన్ని పరిశీలించి, స్థానికులతో వివరాలు ఆరా తీశారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతురాలి సోదరి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం దృశ్యం

నరసన్నపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దేశవానిపేట అభయ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. రుత్వికులు వనమాలి రామకృష్ణ శర్మ, సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, పరిషత్ రక్షాధారణ, అంకురార్పణ, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో చింతు అప్పన్న, ఇట్రాజు ఢిల్లేశ్వరరావు, రావాడ మోహనరావు, బగ్గు జగన్నాథం, చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.


కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

గొల్లలవలసలో..

పోలాకి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గొల్లలవలసలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సుమారు 60 మంది దంపతులు కుంకుమ పూజలు నిర్వహించారు. దీర్ఘాశి మెండవీదిలో శ్రీరామపట్టాభిషేక మహోత్సవం వేద పండితుడు ఆరవల్లి కృష్ణశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో గాయత్రీ బ్రాహ్మణసేవా సంఘం నాయకులు పులుగుర్త నాగేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అల్లాడలో..

జలుమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అల్లాడలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నారాయణస్వామి కల్యాణం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామస్థులు హనుమంతు రంగనాథం దంపతులతో పురోహితుడు బుజ్జిబాబు కల్యాణం చేయించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. పలువురు గ్రామస్థులు కల్యాణాన్ని తిలకించారు.


లక్ష్మీనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు